క్లుప్తంగా

మండలానికి చేరిన క్రీడా సామగ్రి

పెద్దముడియం : ఈనెల 15వ తేదీ నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి క్రీడా సామగ్రి బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి చేరింది. ఈ సామగ్రిని ఎంపీడీవో వెంకటరమణయ్య పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, టెన్నిస్, ఖోఖో తదితర క్రీడలకు సంబంధించి ఒక్కో గ్రామ సచివాలయానికి రెండు కిట్ల చొప్పున సామగ్రి వచ్చినట్లు తెలిపారు. క్రీడాకారులు తమ పేర్లను సచివాలయాల పరిధిలో నమోదు చేసుకోవాలని తెలిపారు.

తాతిరెడ్డిపల్లెలో పర్యటించిన జేసీ


భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పర్యటించారు. గ్రామంలోని గంగమ్మకుంట సమీపంలో 6 ఎకరాల విస్తీర్ణంలో చెరువును నిర్మిస్తున్నారు. ఇందుకోసం 6 ఎకరాల భూసేకరణ విషయమై ఆయన సంబంధిత భూములలో పర్యటించారు. భూమి యొక్క విలువను నిర్ధారించేందుకు ఆయన పర్యటించినట్లు ఆర్డీఓ వెంకటేశులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ త్రిభువన్‌రెడ్డి, ఆర్ఐ సురేంద్ర, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కమలాపురం : ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏఎస్ఓ ఇర్షాద్‌బేగం తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రజలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈవీఎంలోని కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లను ఏర్పాటు చేసి ఓటు వేయించి అవగాహన కల్పించారు. ఓటరు వేసే ఓటు ఎవరికి పడుతుందో వీవీ ప్యాట్‌లో కనిపించడాన్ని ఓటరుకు అవగాహన కల్పించారు. భూ రీసర్వే డీటీ శ్రీకాంత్, వీఆర్‌ఏ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి లక్షార్చన

ఎర్రగుంట్ల : పట్టణంలోని ఐసీఎల్ ఆధ్వర్యంలో కాలనీలోని శివాలయంలో బుధవారం నిర్వహించిన అయ్యప్పస్వామి లక్షార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. అయ్యప్ప స్వామికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఐసీఎల్ యాజమాన్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉనికి కోసం టీడీపీ అగచాట్లు

చింతకొమ్మదిన్నె : ఇటీవల చింతకొమ్మదిన్నె మండలంలో వైఎస్సార్ సీపీ నుంచి పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీలో గతంలో ఉన్నవారికే పచ్చ కండువాలు వేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నట్లు తప్పుగా ప్రచారం చేస్తున్నారన్నారు. ఇటీవల ఆజాద్‌నగర్ ఇప్పపెంట, రసూల్‌పల్లి గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లినట్లు వచ్చిన కథనాలను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల యూత్ కన్వీనర్ గజ్జలఈశ్వర్‌రెడ్డి, ఎస్సీసెల్ కన్వీనర్ చిన్న సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు ఈనెల 9న చివరి రోజు

కమలాపురం : ఓటు నమోదుకు ఈనెల 9వ తేదీ చివరి రోజు అని అర్హత ఉన్న వారందరూ తప్పని సరిగా నమోదు చేసుకోవాలని ఆర్‌ఓ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి నెలలో కొత్త ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. అయితే ఈనెల 9వ తేదీ వరకు ఓటు నమోదుకు అవకాశం ఉందని యువతీ యువకులకు అవగాహన కలిపించాలన్నారు. ఇటీవల రెండు పర్యాయాలు ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించామని, అప్పుడు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ ఎంట్రీ, డెత్ జరిగిన ఓట్లు తప్పని సరిగా తొలగించాలన్నారు. ఓటర్లు కోరిన విధంగా సవరణలు, మార్పులు, చేర్పులు చేసి ఎలాంటి తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేస్తామని ఆయన వివరించారు. తహసీల్దార్లు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అభివృద్ధి పనులకు పెద్దపీట

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


చిన్నపురెడ్డిపల్లెలో మహిళలతో భూమిపూజ చేయిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులకు పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కోగటం సచివాలయ పరిధిలోని కోగటం, చిన్నపురెడ్డి గ్రామాల్లో 2.70 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రధాన రోడ్డు, డ్రైన్స్ నిర్మాణ పనులకు ఆయన మాజీ సర్పంచ్ కరుణ్‌రెడ్డితో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోగటం గ్రామం అభివృద్ధి పనులకు నోచుకోకుండా ఉందని, గ్రామాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో కరుణ్‌రెడ్డి, తాను సీఎం జగనన్న దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన సీఎం తక్షణం అభివృద్ధి పనులకు రూ.2.70 కోట్లు మంజూరు చేశారన్నారు. ఇటీవల జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ గ్రామాల ప్రజలు రోడ్లు, డ్రైన్స్ అడిగారని తాము సీఎంకు విన్నవించామన్నారు. కేవలం మూడు నెలల వ్యవధిలోనే మంజూరు, టెండర్లు, పనులు ప్రారంభం అయ్యాయన్నారు. నెలో రోజుల్లో ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. అలాగే ముస్లింలు షాదిఖానా, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ అడిగారని, రూ.60 లక్షల వ్యయంతో దానిని కూడా త్వరలోనే నిర్మిస్తామన్నారు. టెండర్లు పూర్తి అయ్యాయని, త్వరలోనే ఆ పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా కోగటం గ్రామం అంతా డ్రైన్స్ నిర్మిస్తున్నామని, అడిగిన తక్షణం నిధులు మంజూరు చేసిన సీఎం జగనన్నను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం చిన్నపురెడ్డిపల్లెలో రోడ్లు కావాలని కోరిన మహిళలతోనే రోడ్డు పనులకు భూమిపూజ చేయించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, డీసీసీబీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పుల్లారెడ్డి, జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ భాస్కర్, వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, నిఖిల్‌రెడ్డి, సత్యంరెడ్డి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

దూరదృష్టి కలిగిన వ్యక్తి వైఎస్ జగన్

వీరపునాయునిపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టి కలిగిన వ్యక్తి అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి మైసూరారెడ్డి చేపట్టిన ఉద్యమాల ద్వారా గాలేరు నగరి సుజల స్రవంతి పథకంలో భాగంగా సర్వరాయ సాగర్ ప్రాజెక్టుకు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు భూమి పూజ చేశారు. అయితే తదుపరి ముఖ్యమంత్రులు పట్టించుకోలేదన్నారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పనులు ప్రారంభమయ్యాయన్నారు. రాజశేఖర్‌రెడ్డి పనులు ప్రారంభిస్తే ఆయన కుమారుడు పూర్తి చేయడం జరుగుతోందన్నారు. గాలేరే–నగరి సుజల స్రవంతి పథకంలో మూడు జిల్లాలకు 2.80 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ప్రణాళికల్లో పేర్కొంటే అందులో ఒక్క కమలాపురం తాలూకాకు 80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. ఈనెల 10వ తేదీన చెన్నూరు మండలం కొండపేట వంతెన వద్ద జరగబోవు సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలు, నాయకులకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీర ప్రతాప్‌రెడ్డి, గడ్డంవారి సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు యాత్రకు తరలిరావాలి

పెండ్లిమర్రి : ఈనెల 10వ తేదీన చెన్నూరులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పెండ్లిమర్రిలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని మారుమూల ప్రాంతాలనుంచి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఆగ్రోకార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

పులివెందుల టౌన్,రూరల్ : పట్టణంలోని పాత బస్టాండులో వెలసిన శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 2 నుంచి ప్రారంభమైన అష్టబంధన కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా ఐదు రోజులపాటు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ రోజు గురువారం స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా సుమారు 10 వేల మందికి తొండూరు మండలం తేలూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, బీవీఎస్‌ఆర్ లారీ ట్రాన్స్‌పోర్ట్ భారతి సిమెంట్ కాంట్రాక్టర్ బి.వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కుల గణన సర్వేపై అవగాహన

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేపై వెంకటాపురం సచివాలయంలో బుధవారం మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ దాసరి చంద్రమౌళి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతి వలంటీర్ వారి వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి కుల గణన సర్వే చేయాలన్నారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలని తెలిపారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం


వలంటీర్లకు సర్వే కిట్లను అందిస్తున్న మండల కన్వీనర్, జెడ్పీటీసీ తదితరులు

వేంపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డిలు తెలిపారు. బుధవారం వేంపల్లె 8వ సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ (ఏపీకి జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సచివాలయ పరిధిలో ఆయా పథకాలతో లబ్ధి పొందిన వివరాలు, సంక్షేమాభివృద్ధికి సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలన, మ్యానిఫెస్టో అమలు, వివిధ సంక్షేమ, అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీపీ లక్ష్మీగాయత్రి, ఎంపీటీసీ రహమతుల్లా ఖాన్, హజ్ కమిటీ డైరెక్టర్ మునీర్, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మండలంలోని పెద్ద కొమ్మెర్ల గ్రామంలో వైఎస్ జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమంలో మైలవరం మండలం ఎంపీపీ చేరెడ్డి సావిత్రి పాల్గొని మాట్లాడారు. గతంలో పథకాలు కేవలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే మంజూరు చేసేవారని, నేడు పార్టీలకు అతీతంగా మంజూరు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సర్పంచ్ చిన్నయ్యరెడ్డి, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన సచివాలయం ప్రారంభం


నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని మోరగుడి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎంపీపీ జి.హరితతో కలసి ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలు పట్టణాలకు వెళ్లవలసిన అవసరం లేకుండా వారి గ్రామాల్లోనే ఉండి పనులు చేసుకునే అవకాశం జగనన్న కల్పించారన్నారు. రానున్న రోజుల్లో జగనన్న సారధ్యంలో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అశ్వని, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించండి

జమ్మలమడుగు : అధికారులు ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి బుధవారం ముద్దనూరు మండలం కమ్మవారిపల్లె గ్రామానికి చెందిన ప్రజలతో కలిసి ఆర్డీఓ జి.శ్రీనివాసులును కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయరహదారి నిర్మాణం కోసం చాలా మందికి సంబంధించిన ఇళ్లు పోతున్నాయన్నారు. అయితే కొంతమంది ఇళ్లు మొత్తం పోయి మరికొంత మంది ఇళ్లుపోను అర సెంటు స్థలాలు మిగిలిపోతున్నాయన్నారు. జాతీయ రహదారి అధికారులు ఆ స్థలాన్ని కూడా జాతీయ రహదారిలోకి కలుపుకోవాలని రెవెన్యూ అధికారులకు బాధితులు విన్నవించుకున్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : తమ పరిధిలోని వనరులను వినియోగించుకుని పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లకు నిర్వహించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి పంచాయతీ పరిధిలో ఉన్న స్థానిక వనరులను వినియోగించుకుని సంపద సృష్టించి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆస్తి, నీటి పన్నులు, వీధి దీపాలు, డ్రైనేజ్ పన్నులే కాకుండా వ్యాపార దుకాణాల లైసెన్స్‌లు, లేఔట్ అప్రూవల్, సెల్ టవర్లు తదితర వాటిపై దృష్టి సారించి పంచాయతీ ఆదాయాన్ని పెంచాలన్నారు. అలాగే ప్రజా ప్రతినిధుల సమావేశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సభ్యులు కోరం లేక పోతే సభలు వాయిదాలు వేయడం, వరుసగా మూడు సమావేశాలకు సభ్యులు గైర్హాజరైతే వారి సభ్యత్వాన్ని రద్దు చేయడంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఆర్‌పీలు పంచాయతీల విధులపై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శారదారెడ్డి, అన్ని సచివాలయాల సెక్రటరీలు, డీఏలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జువారి డీఏవీ విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఎర్రగుంట్ల : విజయవాడలోని ఎస్‌టీటీపీఎస్ డీఏవీ స్కూల్ నందు జరిగిన డీఏవీ నేషనల్ స్పోర్ట్స్ క్లస్టర్ స్థాయిలో రాష్ట్రస్థాయి పోటీలకు జువారి డీఏవీ స్కూల్ విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఎవీజీఎస్ నాయుడు బుధవారం తెలిపారు. ఈనెల 9,10 తేదీలలో హైదరాబాద్‌లోని సఫిల్ గూడ్ డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించనున్న కబడ్డీ, చెస్, బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులను జువారి సంస్థ ఐఎంసీ జీఎస్‌బీ రావ్, మేనేజర్ వసంతరామన్, సీనియర్ మేనేజర్ ఫణికుమార్, డీఏవీ రిజనల్ అధికారి శేషాద్రి, ఉపాధ్యాయులు అభినందించారు.

బ్రిడ్జి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి


బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

కమలాపురం : కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో పాపాఘ్ని నదిపై జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ప్రతినిధి బృందం బ్రిడ్జి వద్ద జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. అటవీశాఖ అనుమతులు లేవని పనులు ఆపడం దారుణం అన్నారు. అన్ని అనుమతులు తీసుకోకుండా ఎలా పనులు ప్రారంభించారని ఆయన ప్రశ్నించారు. బ్రిడ్జి కూలి పోయి రెండేళ్లు పూర్తి కావస్తున్నా కొత్త బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాక పోవడం దారుణం అన్నారు. చిన్నపాటి వర్షానికే అప్రోచ్‌రోడ్డుపై నీరు నిలుస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. కడప నుంచి కమలాపురం, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కొండాపురం, తాడిపత్రి, అనంతపురం వెళ్లే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పితామహుడు బీఆర్ అంబేడ్కర్


పులివెందులలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : భారత రత్న, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మాజీ కౌన్సిలర్ కోళ్ల భాస్కర్ ఆధ్వర్యంలో పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి బుధవారం పలువురు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ సామాజిక మరియు రాజకీయ దృశ్యాల్ని రూపొందించడంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర పోషించిన దూర దృష్టి గల నాయకుడన్నారు. ప్రతి ఒక్కరు అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, ఆలయ కమిటీ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్ పురుషోత్తమ్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో : స్థానిక ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.ఎస్. బేగ్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 76వ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు వేలూరు శ్రీనివాసులరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపల్లె : దేశంలోని బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆప్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా కో ఆర్డినేటర్ రహమతుల్లా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆప్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం అబేడ్కర్ చిత్రపటానికి ఏపీఎంఆర్పీఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో నాగప్రసాద్ మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు బలహీన వర్గాలకు చేసిన మేలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీ ఎంఆర్పీఎస్ రాయలసీమ ఉపాధ్యక్షుడు బి.శ్రీనివాసులు మాదిగ, సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఎంఈఓలు పాల్గొన్నారు

పెండ్లిమర్రి : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలఓబయ్య, గౌరవ అధ్యక్షుడు సుబ్బరాయుడు, జైభీమ్ సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళి అర్పించారు. మహిళా అధ్యక్షురాలు విజయరాణి, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంశర్మల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. రామనపల్లెలో అంబేడ్కర్ సేవాసమితి అధ్యక్షుడు గురయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎర్రగుంట్ల : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పట్టణంలోని సీపీఐ, సీపీఎంలతో పాటు ఇతర పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వై జంక్షన్‌లోని అంబెడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే నాలుగు రోడ్ల కూడలిలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నివాలర్పించారు. అలాగే ఆర్టీపీపీలో పొంటైన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వేల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నివాలర్పించారు. ముఖ్యఅతిథిగా ఆర్టీపీపీ సీఈ నాగరాజు పాల్గొని నివాలర్పించారు. డీఈ ఎఫ్ఎం సిద్దయ్య, పర్యవేక్షణ అధికారులు, ఇంజనీర్లు, అసోసియేషన్ సభ్యులు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులు అర్పించారు. తాడిపత్రి రహదారిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా కొనియాడారు. అలాగే ప్రజా సంఘాలు, బీజేపీ దళిత మోర్చా మేకల ఆంజనేయులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

శేష వాహనంపై దేవదేవుడు


గ్రామోత్సవంలో సతీసమేత వెంకటరమణస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవెంకటరమణ స్వామి ఆలయంలో ఐదు రోజులుగా జరుగుతున్న అష్ట బంధన మహా కుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా బుధవారం దేవ దేవుడైన కలియుగ వెంకటరమణుడు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో బీవీఎస్ఆర్ లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమాని బి.వి.సుబ్బారెడ్డి, ప్రధాన అర్చకులు వరదాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

చింతకొమ్మదిన్నె : తుపాన్ వల్ల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మండలంలోని దెబ్బతిన్న అరటి, బొప్పాయి, తమలపాకు తోటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం దెబ్బతిన్న పంటలకు చెందిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ


వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్ల : పట్టణంలోని సెయింట్ థామస్ చర్చి ఆవరణలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 134 మంది వృద్ధులకు పొరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులకు బుధవారం దుస్తులు పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి, చిత్తా దంపతులు క్రిస్మస్, నూతన సంవత్సరాలను పురస్కరించుకుని ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారని సంస్థ ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. రెవరెండ్ ఫాదర్ ఎల్ మోజస్, వృద్ధులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : స్థానిక పొన్నతోటలోని చర్చి పరిధిలో ఉన్న 145 మంది వృద్ధులకు ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్‌నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్‌గీత, తోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం దుస్తులను పంపిణీ చేశారు.

అంగవైకల్యం శరీరానికే గానీ మనసుకు కాదు

వల్లూరు : అంగ వైకల్యం అనేది శరీరానికే గానీ మనసుకు సంబంధించినది కాదని, దివ్యాంగుల్లో కూడా ఒక్కొక్కరిలో ఒక్కో రకమైన ప్రతిభ దాగి వుంటుందని ఎంఈవో – 2 విజయారెడ్డి తెలిపారు. వల్లూరులోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గన్న ఆయన మాట్లాడారు. వల్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు విద్యావతి మాట్లాడుతూ ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా పిల్లలకు కావాల్సిన అన్ని రకాల సదుపాయాలను సమకూరుస్తోందని, ప్రతి బుధవారం ఫిజియో థెరపీ సేవలను అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించి బహుమతులను అంద చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు లక్ష్మీ ప్రసన్న, అలివేలమ్మ, సీజీవీ నిర్మల జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది, ఎమ్ఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ప్రజా వేదిక


కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్న

వీరపునాయునిపల్లె : 2022 ఏప్రిల్ నుంచి మార్చి 2023 వరకు మండలంలోని 22 పంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన రూ.9కోట్ల50 లక్షల పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం డ్వామా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్న ఆధ్వర్యంలో ప్రజావేదిక జరిగింది. గ్రామాల వారిగా డీఆర్పీలు నిర్వహించిన తనిఖీ వివరాలను చదివి వినిపించారు. నివేదికలు పరిశీలించిన ఆమె చిన్న తప్పిదాలకు సంబంధించి సిబ్బంది ద్వారా రూ. 39.725 నగదు రికవరీకి ఆదేశించారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని అంతే కాకుండా అన్ని గ్రామాల్లో పనులు సవ్యంగా జరిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డ్వామా డీవీఓ యోగాంజుల రెడ్డి, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయ్‌భాస్కర్, ఎస్ఆర్‌పీ లక్ష్మి నారాయణ, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఇంజనీర్ మల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక


డి.శ్రావణ్‌కుమార్

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్‌బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శివమునెమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ గతనెల 10, 11, 12వ తేదీలలో విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో తమ విద్యార్థి డి.శ్రావణ్‌కుమార్ జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈనెల 16 నుంచి 21వ తేదీవరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. తదితర ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ప్రత్యేక పూజలు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీ పద్మావతి మాతకు విశేష పూజలు నిర్వహించారు.